www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 18 నవంబర్ 2023

రేపు శ్రీవారి ఆలయంలో పుష్పయాగం

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో 19న ఆదివారం పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా జరగనుంది. శనివారం సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. పుష్పయాగం రోజున ఆలయంలో రెండవ అర్చన, రెండవ గంట, నైవేద్యం అనంతరం ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఉత్సవర్లను సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఆర్జిత సేవలను టిటిడి రద్దు చేసింది.

27 నుంచి రాష్ట్రంలో పక్కాగా కులగణన-2023

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి, ప్రజల సామాజిక స్థితిగతులను తెలుసుకోవడం కోసం ఈనెల 27 నుంచి కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అన్నారు. శుక్రవారం సాయత్రం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుల గణన - 2023 నిర్వహణపై జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ డి కె బాలాజీ వర్చువల్ విధానంలో డివిజన్, మండల స్థాయి అధికారులకు కులగణన చేపట్టే విధానంపై దిశా నిర్దేశం చేసారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటికే వాలంటీర్ల ద్వారా అన్ని కుటుంబాలకు తెలియజేస్తున్నామన్నారు. గణన ప్రారంభం అయిన రోజు వాడుతున్న సెల్ ఫోన్ ద్వారానే పూర్తి అయ్యేవరకు వివరాలు అందులోనే అప్ లోడ్ చేయాలి, మొబైల్ పనిచేయని స్థితి వస్తే తప్పనిసరిగా పై అధికారులకు తెలియజేయాలన్నారు. అన్ని తరగతులకు చెందిన కులాల వారి సంఖ్యను లెక్కించేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన జీవనోపాధి, జనాభా సమతుల్యత అన్న అంశాలపై ఈనెల నవంబర్ 27 నుండి డిసెంబర్ 10 వరకు జిల్లాలో సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుల గణన చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే యాప్ వాడే విధానం పి పి టి సచివాలయ సిబ్బందికి అందుబాటులో ఉంచామని, అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. 22 న సచివాలయ స్థాయి శిక్షణ మరోసారి పూర్తి కావాలని అన్నారు. కులాలకు సంబంధించి వివరాలు యాప్ లో లేకపోతే మాన్యువల్ గా రాసుకోవాలన్నారు.

26 వరకూ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెలలో ప్రారంభిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని జిల్లాకు 6 ప్రచార వాహనాలు రానున్నాయని అన్నారు. 60 రోజులు అన్ని గ్రామపంచాయితీ లు తిరగనున్నయని అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన, పోషన్ శక్తి నిర్మాన్ అభియాన్, జన్ ధన్ యోజన, చేతి వత్తి దారులకు తదితర పథకాలను ప్రచారం చేస్తూ రోజుకు నాలుగు వాహనాలు పంచాయితీల్లో ప్రచార వాహనంతో చిత్ర ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జనవరి 26 వ తేదీ వరకు జరుగుతుందని, విజయవంతం చేయాలని అన్నారు.

ఆడుదాం ఆంధ్రా:...

జాయింట్ కలెక్టర్ డి కె బాలాజీ మాట్లాడుతూ డిసెంబర్ 15 నుండి 2024 జనవరి 21 వరకు జిల్లా లో నిర్వహించే అడుదాం - ఆంధ్రా క్రీడ పోటీలను ఎలాంటి చిన్న పొరపాటు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని , ప్రతి సచివాలయం పరిధిలో ఒక్క విభాగంలో రెండు టీమ్స్ ను గుర్తించాలని కార్యదర్శులను ఆదేశించారు. వెన్యూ, టెక్నికల్ టీమ్స్ ,క్రీడా కారులను ఎంపిక అప్ లోడ్ పూర్తి చేయాలని యం పిడిఓ లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జగనన్న విద్యా విద్యా దీవెనకు సంబంధించి తల్లుల ఖాతాలకు విద్యార్థుల జాయింట్ అకౌంట్ ఈ నెల 24 లోపు పూర్తి కావాలని అన్నారు. ఈ వర్చువల్ సమావేశంలో డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొనగా, కలెక్టరేట్ నుండి జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ పద్మావతి అమ్మవారి రథోత్సవం

ప్రజాశక్తి - తిరుచానూరు

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన శుక్రవారం ఉదయం రథోత్సవం కన్నులపండువగా జరిగింది. ఉదయం 8.40 గంటలకు రథోత్సవం మొదలై ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. మధ్యాహ్నం 12 గంటల నుండి రథమండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రథోత్సవంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఈవో ఎవి ధర్మా రెడ్డి, జేఈవో వీర బ్రహ్మం, సిఈ నాగేశ్వరరావు, ఎస్ ఈ-3 సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపు

శనివారం పంచమి నేపథ్యంలో తిరుచానూరు వైపు వెళ్లే వాహనాల ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలు అమల్లో ఉంటాయని ఎస్పి పరమేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి 12 గంటల నుంచి సింధు కూడలి నుంచి తిరుచానూరు లోపలికి ఎటువంటి వాహనాలు అనుమతి లేదు. పూడి, జడ్‌పి హైస్కూల్, నవజీవన్ హోల్డింగ్ పాయింట్ నుంచి క్యూలైన్ల ద్వారా నాలుగో గేటు నుంచి మాత్రమే పుష్కరిణి లోనికి ప్రవేశం ఉంటుంది. తిరుచానూరు ప్రజలు గ్రామంలో ఎలాంటి వాహనాలపై తిరగకుండా పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి. భక్తులు విలువైన ఆభరణాలు ధరించి రాకూడదు. వస్తువులు, సెల్‌ఫోన్లు జాగ్రత్తగా ఉంచుకోవాలి.

నేడు తిరుచానూరు పంచమి

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

సురభి అకాడమీ ఆఫ్ పర్ఫామెన్స్ డైరెక్టర్ డాక్టర్ సురభి లక్ష్మి శారద ఆధ్వర్యంలో వారి బందంచే ఏర్పాటు చేసిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టులు, ఎస్ వి సంగీత నత్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మహతి ఆడిటోరియంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే.. అందులో భాగంగా హైదరాబాద్కు చెందిన డాక్టర్ సురభి లక్ష్మీ శారద బందం ఏర్పాటు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ సురభి లక్ష్మి శారద ప్రదర్శించిన కులుకగా నడవరో కుమ్మలాల ఒక పని ఒక పని వయ్యారమై అన్న అన్నమయ్య కీర్తనలు రమ్యంగా నత్తించి ప్రేక్షకుల మన్ననలను అందుకున్నారు. భరతనాట్య కూచిపూడి నత్యాలు సుస్మిత, సుశ్రుత, హిమ రితిక. భరణి, ఐశ్వర్య, చరిత, రాగసుధ, పూర్ణ జోషిత, పూజిత, మోక్షిత పావని చాలా చక్కగా అభినయించారు. ఈ సందర్భంగా కళాకారులను పలువురు అభినందించారు.



సిఎం పర్యటన జయప్రదం చేయాలంటూ పెద్దిరెడ్డి సమీక్ష

21న పులికాట్ పనులకు సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి - తడ

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సూళ్లూరుపేటలో పర్యటించనున్నారు. పులికాట్ సరస్సు ముఖద్వారాలు పూడికతీసే పనులకు సిఎం శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కాళంగి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సిఎం పర్యటన నేపథ్యంలో రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖా మంత్రి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమం నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, ఎంఎల్‌ఎలు కిలివేటి సంజీవయ్య, ఆదిమూలం, ఎంపి గురుమూర్తి పాల్గొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. హెలిప్యాడ్ కొరకు అపాచీ సమీపంలోని స్థలాన్ని పరివీలించారు. స్థానిక టివిఆర్ఆర్ కల్యాణ మండపంలో అధికారులతో సమీక్ష జరిగింది.

జగన్ పర్యటనపై పెద్దిరెడ్డి సమీక్ష

దుక్కిలో ఎరువుల వాడకంపై జాగ్రత్తలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

రబీ వరి సాగు దుక్కిలో ఎరువుల వాడకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ ఎడిఎ మెరుగు భాస్కరయ్య తెలిపారు. ఆఖరి దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసి కలియ దున్నుకోవాలి. నాటేముందు సిఫార్సును బట్టి రైతులు సూటి ఎరువులను , వివిధ కాంప్లెక్స్ ఎరువులను వేస్తుంటారు. సూటి ఎరువులు వేసే వారు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎకరాకు 150 కిలోలు, యూరియా 30 కిలోలు, పొటాష్ 15 కిలోలు వేసుకోవాలి. డిఏపి వేసే రైతులు ఎకరాకు 50 కిలోలు డిఏపి, 15 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకోవాలి. 20:20:0: కాంప్లెక్స్ వేసేవారు 100 కిలోలు 20:20:0:, 15 కిలోలు పొటాష్ వాడాలి. 14:35:14 వాడే రైతులు 50 కిలోల 14:35:14, యూరియా 20 కిలోలు వేసుకోవాలి. 10:26:26 వాడే రైతులు 50 కిలోల10:26:26, 25 కిలోల యూరియా కలిపి వేసుకోవాలి. వీటిలో తక్కువ ధరకు లభించే ఎరువులను రైతులు వేసుకుంటే మంచిది. స్థానికంగా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో వున్న ఎరువులను వినియోగించు కోవడం రైతులకు అనుకూలంగా వుంటుందని తెలిపారు.

వరి నాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు

నారుమడి నుండి నారు తీసే వారం రోజులు ముందు ఎకరాకి సరిపడా నారుమడికి కిలో కార్బోఫ్యురాన్ 3జి గుళికలు వేసి నీరు పెట్టి ఇంకించాలి. దీనివలన పొలంలో నెల వరకు పైరుకు పురుగులు ఆశించవు. వరి రకాల పంట కాలాన్ని బట్టి 22 నుండి 28 రోజుల వయసుగల నారును నాట్లు వేసుకోవాలి. నారుమడి నుండి పెరికిన నారు కట్టలను నానో డిఏపి ద్రావణంలో(లీటరు నీటికి 4 మి. లీ) 15 నిమిషాలు ముంచి నాటిన పొలంలో పైరు తొందరగా వేర్లు తొడిగి నాటుకుంటాయి. నారును పొలంలో నాటేముందు కొనలు తుంచి నాటాలి. దీనివలన నారు కొనలలో కాండం తొలుచు పురుగు, ఇతర పురుగు పెట్టిన గుడ్లను నాశనం చేయవచ్చును. నాట్లు పై పై నే 3 సెంటీమీటర్ల లోతు లోనే నాటాలి . దీనివల్ల మొక్కలలో పిలకలు ఎక్కువగా వస్తుంది. నాటేటప్పుడు పొలంలో ప్రతి 2 మీటర్ల దూరానికి 20 సెంటీమీటర్ల కాలిబాటలు వదిలి నాటాలి. కాలిబాటలు తూర్పు పడమర దిశగా ఉంచాలి. దీనివలన పొలంలో గాలి వెలుతురు పుష్కలంగా అంది చీడల సమస్య తగ్గుతుంది. ఎరువులు, పురుగు మందులు ఉపయోగించుటకు సులభంగా ఉంటుందని తెలిపారు.

సైన్స్ ఫేర్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రీజినల్ సైన్స్ సెంటర్, తిరుపతి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైన్స్‌ఫేర్‌ను టిటిడి డిప్యూటీ ఈఈ దేవేందర్ బాబు శుక్రవారం ప్రారంభించారు. స్థానిక సైన్స్ రీజినల్ సెంటర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సజనాత్మకను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చాలా అవసరం అన్నారు. పిల్లల్లో సైన్స్ పరంగా మరింత నైపుణ్యతను తీసుకొచ్చేందుకు కషి చేయాలని సూచించారు. తిరుపతి బాలోత్సవం కార్యదర్శి మల్లారపు నాగర్జున మాట్లాడుతూ తిరుపతి బాలోత్సవాన్ని రెండు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశామన్నారు. అప్పట్నుంచి అనేక ప్రభుత్వ ప్రైవేట్ తిరుపతి మున్సిపల్ స్కూళ్లలో విద్యార్థులకు అతి దగ్గర బంధువయామని గుర్తు చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు చదువుల్లో తీవ్ర ఒత్తిడి ఉందన్నారు. మానస వికాసం తగ్గుతుందని తెలిపారు. వాటి నుంచి పిల్లల్ని బయటపడేసేందుకు ఆటపాట మాట తదితర కార్యక్రమాల ద్వారా మానసిక ఉల్లాసాన్ని కలిగించాలన్నదే బాలోత్సవం లక్ష్యం అన్నారు. ఇందుకు కషి చేస్తున్న తమకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ సైన్ సెంటర్ నిర్వాహకులకు కతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్లో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో పెద్ద ఎత్తున బాలోత్సవం నిర్వహిస్తున్నామని, ఇందులో విద్యార్థులు బాలలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బాలోత్సవం అధ్యక్షులు టెంకాయల దామోదరం మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో ఉన్న విజ్ఞానాన్ని జీవితానికి అన్వయించుకుని, ప్రతి ఒక్కరూ విజ్ఞానవంతులుగా ఎదిగేందుకు కషి చేయాలన్నారు. శాస్త్రీయతపై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువుల పై ఉందని, మూఢనమ్మకాలను పారదోలాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలు తయారు చేసిన పలు అంశాలను ప్రదర్శన ఉంచారు. అనంతరం పిల్లలచే సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సైన్స్ ఫేర్ 17, 18 తేదీల్లో రెండు రోజులు పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నెహ్రూ, పలు పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు జరగనున్న సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తూ...



తిరుపతిలో...

రేణిగుంటలో..

పాఠకులు కవి సమ్మేళనంపై ఆసక్తి కలిగి ఉండాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పాఠకులు కవి సమ్మేళనంపై అవగాహన కలిగి ఉండాలని గ్రంథాలయ ఛైర్మన్ ఎన్ మధుబాల తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక అన్నమయ్య కూడలిలోని గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయంలో శుక్రవారం 'కవి సమ్మేళనం' కార్యక్రమం శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తి మండ ప్రతాప్, గ్రంథాలయాధికారి జె.శివ ప్రసాద్ సంయుక్త నిర్వహణలో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నైనారు మధుబాల మాట్లాడుతూ కవి సమ్మేళనాల ద్వారా మరింతగా వీక్షకులు పుస్తకాలపై ప్రేమను పెంచుకుంటారని అన్నారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన వి.ఆర్. రాసాన, సాకం నాగరాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా కవులలో నూతనోత్సాహం మరింతగా పెరిగి మంచి మంచి సందేశాలతో కూడిన కవిత్వాలు వెలుగులోకి వస్తాయన్నారు. అనంతరం నైనారు మధుబాల కవులందరినీ దుశ్శాలువా, మెమెంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక తిరుపతి శాఖ రాష్ట్ర కార్యదర్శి అరవ జైపాల్ నిర్వహణలో సీనియర్ కవి రచయిత అడిగోపుల వెంకట రత్నం , సురేంద్ర రోద్ద , డాక్టర్ రోజా రమణి , అమరేంద్ర , డాక్టర్ సోము ఉమాపతి, డాక్టర్ స్రవంతి , షణ్ముఖం , యం.ఇ.ఓ హేమ మాలి, డాక్టరేట్ జి.యస్.ప్రసాద్ ధనాసీ ఉషారాణి తదితరులుపాల్గొన్నారు.

రేణిగుంటలో... ప్రపంచంలోనే భారతదేశం సంస్కతి సంప్రదాయాలు గొప్పవని గ్రంథాలయ అధికారిని శ్రీముఖి స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని మంచినీళ్ల కుంట సమీపంలో గల గ్రంథాలయం నందు గ్రంథాలయ వారోత్సవాలను శ్రీముఖి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ మహాకవులు తిక్కన్న నన్నయ్య బమ్మెర పోతన వాల్మీకి గుర్రం జాషువా లాంటి మహాకవులను కన్న భారతదేశం మనదన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు డ్రాయింగ్ నత్య పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సిబ్బంది తహర పాల్గొన్నారు.

టిటిడి చైర్మన్‌కు ఆహ్వానం

తిరుపతి సిటీ : ఈ నెల 23 వ తేదీ నుంచి తలపెట్టిన శ్రీ శ్రీనివాసా దివ్యానుగ్రహ విశేష హోమానికి విచ్చేయాల్సిందిగా కోరుతూ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని అర్చకులతో కలిసి అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం భూమన కరుణాకర రెడ్డి కి పద్మావతి పురం లోని భూమన నివాసం వద్ద ఆహ్వాన పత్రికను అందించారు. భూమన కరుణాకర రెడ్డి నేతత్వంలో జరిగిన టీటీడీ పాలక మండలి తొలి సమావేశంలో శ్రీ శ్రీనివాసా దివ్యానుగ్రహ విశేష హోమాన్ని నిర్వహించాలని తీర్మానించిన విషయం తెలిసిందే.

రైతు సమస్యలపై దీక్షను జయప్రదం చేయండి : సిపిఐ

గూడూరు టౌన్ : కరువుతో రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని ఈనెల 20, 21 తేదీల్లో విజయవాడలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగే 30 గంటల దీక్షను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి శశి విజ్ఞప్తి చేశారు. గూడూరు పట్టణంలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో గోడపత్రికను విడుదల కచేశారు. కరువు నివారణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జరిగే దీక్షలో రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఎఐటియుసి కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య, చల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐఎంఎ నూతన అధ్యక్షులుగా డాక్టర్ టి జనార్ధన్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకయ్యింది. తిరుపతి బ్రాంచ్ అధ్యక్షుడుగా డాక్టర్ టి జనార్దన్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డాక్టర్ వెంకటరమణ, ట్రెజరర్‌గా డాక్టర్ కష్ణ కాంత్ నియమితులయ్యారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఎన్నికల అధికారిగా ఆనంద్ నాయుడు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఐఎంఏ తిరుపతి బ్రాంచ్ అధ్యక్షులు ఎన్నికైన డాక్టర్ జనార్దన్ మాట్లాడుతూ తిరుపతిలో ఐఎంఏ అభ్యున్నతికి కషి చేస్తానని చెప్పారు. సేవా కార్యక్రమాలు చేస్తామని వెల్లడించారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన వారందరికీ కతజ్ఞతలు తెలియజేశారు . తిరుపతి బ్రాంచ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ శ్రీహరి, డాక్టర్ రెడ్డప్పతోపాటు పలువురు డాక్టర్లు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుని సత్కరించిన వీసి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డాక్టర్ ఎం అంజిద్ ఆలీని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ అభినందించారు. బుధవారం మర్యాదపూర్వకంగా వారిని కలిసిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆలీని దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు మరిన్ని అందుకొని, విద్యార్థుల ఉన్నతికి కషి చేయాలని సూచించారు. ఆయన అభినందించిన వారిలో ఇమామ్ సాహెబ్, ఫ్యాకల్టీ వర్సిటీ సిబ్బంది ఉన్నారు.

అప్సా రాష్ట్ర అధ్యక్షులుగా సుబ్రమణ్యంరాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఏపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ నూతన ఎన్నికలను గురువారం విజయవాడ కేంద్రంగా నిర్వహించారు. ఈ కార్యవర్గ కమిటీ ఎన్నికలలో తిరుపతి జిల్లాకు చెందిన అప్సా జిల్లా అధ్యక్షులు వి. సుబ్రమణ్యం రాజును ఏకగ్రీవంగా రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాలకు చెందిన అప్సా నేతలు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవి తనకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో ప్రైవేట్ స్కూళ్ల సమస్యలపై మునుపటి కంటే మరింత ఉత్సాహంగా పరిష్కారానికి చొరవ చూపిస్తానని సుబ్రమణ్యం రాజు తెలిపారు.

ఆటల్లోనూ నైపుణ్యం చూపాలి: సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

విద్యార్థులు ఆటలలోనూ నైపుణ్యత చూపాలని తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఇటీవల ఐఐటి తిరుపతి అంతర్ కళాశాలల పోటీలలో వివిధ విభగాల్లో రాణించిన క్రీడా బృందాలకు అభినందన సభను నిర్వహించారు. విద్యార్థులకు మంచి ప్రోత్సాహకం ఇచ్చిన కళాశాల పీడి కిషోర్ నాయక్ తదితరులను అభినందించారు.

నిర్మలమ్మ' నోట శ్రీసిటీ మాట

ప్రజాశక్తి-వరదయ్యపాలెం

దేశంలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు పొందిన శ్రీసిటీ గురించి కేంద్ర మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రస్తావించడం, ప్రశంసించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఆమె గురువారం తిరుపతి సిజిఎస్‌టి కమిషనరేట్‌లోని జిఎస్‌టి భవన్‌కు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమంలో వర్చువల్ గా పాల్గొని ప్రసంగించారు. ఆమె ప్రసంగంలో తిరుపతి జీఎస్టీ కమిషనరేట్ ఆదాయం గణనీయంగా వద్ధిని సాధించిందని పేర్కొన్నారు. ఈ రాబడికి శ్రీసిటీలోని పలు రంగాల పరిశ్రమలు, జిల్లాలోని ఇతర పరిశ్రమలు దోహదపడిందని ఆమె చెప్పారు. అభివద్ధి చెందుతున్న శ్రీసిటీ పారిశ్రామిక కేంద్రంలో భవిష్యత్ వద్ధికి మంచి అవకాశం ఉందని, తద్వారా దేశ జిడిపికి గణనీయంగా తోడ్పాటు అందిస్తుందని ఆమె వ్యాఖ్యానించారు. కచ్చితమైన గణాంకాలతో నిక్కచ్చిగా మాట్లాడే కేంద్ర ఆర్థిక మంత్రి నోట శ్రీసిటీ మాట రావడం, కితాబివ్వడం తమ కషికి తగిన గుర్తింపుగా భావిస్తున్నట్లు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు.



ఎమ్మెల్యే భూదాహానికి అడ్డే లేదా : బొజ్జల సుధీర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే భూదాహానికి అడ్డు అదుపు లేకుండా పోతుందని, అడ్డు వచ్చిన వారిని తన అనుచర గణంతో అణచివేస్తూ వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను, ప్రైవేటు భూములను వదలకుండా ఆక్రమించి వందల కోట్ల రూపాయలను వెనకేసుకుంటున్నారని శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ బాధ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తన అనుచర గణంతో మండలం, గ్రామపంచాయతీలలో ఉన్న ప్రభుత్వ భూములను బినామీలను ఏర్పాటు చేసుకుని తన వశం చేసుకుంటున్నారని అన్నారు. ఒక్క రేణిగుంట మండలంలోని 556 కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, కాలువ పోరంబోకు, చెక్ డ్యామును తన బినామీ అయిన పి.మునిరెడ్డి ఆక్రమించుకున్నాడని, దీనిపై క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారుల నుండి జిల్లా కలెక్టర్ కు తగిన ఆధారాలతో అర్జీలు ఇచ్చినా బుట్ట దాఖలు అవుతున్నాయన్నారు. రేణిగుంట మండలంలోని వెంకటాపురం, అన్నాస్వామి పల్లి, ఆర్.అగ్రహారం, తిరుపతి అర్బన్ పరిధిలోని చెన్నాయిగుంట ప్రాంతాల్లోని సర్వే నంబర్లు 261లో 6.5 ఎకరాలు, 385లో 31.65, 364లో 3.82, 368లో 0.5, 335లో 4.46, 338లో 5.48, 341లో 8.66, 359లో 8.25, 222/5లో 8.33 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు 217లోని చెక్‌డ్యాంను మునిరెడ్డి ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్ నగర్ లో సర్వేనెంబర్ 231, 232, 233, 234 లోని 18 ఎకరాల భూమిలో 250 ఫ్లాట్లు వేసి 15 లక్షల రూపాయల లెక్కన అమ్ముకుంటున్నారన్నారు. శ్రీకాళహస్తి పరిధిలో ఆర్మీ జవాన్లకు కేటాయించిన భూమిని కూడా లిటిగేషన్కు తెప్పించి భూ కబ్జాకు పాల్పడ్డారన్నారు. తొట్టంబేడు మండలం శివనాథపాలెంలో 70 ఎకరాల్లో 200 మంది ఇల్లు కట్టుకొని నివసిస్తుంటే ఆ స్థలంపై ఎమ్మెల్యే కన్ను పడిందని, ఉన్నపలంగా 200 ఇళ్లలోని పేదలను ఆ గ్రామం నుండే తరిమేసారన్నారు. చింతలపాలెం లో 70 ఎకరాలు, ఏర్పేడు మండలంలో సర్వేనెంబర్ 125/బి లోని 12 కోట్లు విలువైన నాలుగు ఎకరాల స్థలాన్ని, సర్వేనెంబర్ 36లో 60 కోట్లు విలువైన 12 ఎకరాల భూమిని ఇలా చెప్పుకుంటూ పోతే నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే భూదాహానికి అడ్డు అదుపు లేకుండా పోతోం దన్నారు. కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం డికేటి భూములను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించడంతో, దానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు రాకమునుపే ఎమ్మెల్యే బినామీ అక్కుర్తి మధు, సుధాకర్ రెడ్డి రైతుల వద్దకు వెళ్లి వారి ఆధీనంలోని డీకేటి భూములను తక్కువ ధరకే అగ్రిమెంట్ చేయించుకొని ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాక రిజిస్ట్రేషన్స్ చేసుకోవాలని పథకం రచించారన్నారు. ఇవే కాకుండా సొంత పార్టీ నాయకుడు జయకష్ణ ఆస్తిని కూడా లాగేసుకున్నారన్నారు. ఎమ్మెల్యే ఆగడాలపై అన్ని ఆధారాలతో ఉన్నతాధికారులకు అందించినా అధికారులు పరిశీలిస్తామంటారు తప్ప చర్యలకు ఉపక్రమించడం లేదని, రాబోవు ఎన్నికల్లో ప్రజలు ఎమ్మెల్యేకు తమ ఓటుతో తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

రూ.40 కోట్లతో పంచాయతీల అభివృద్ధి

- తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి

మాట్లాడుతున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: 40 కోట్ల రూపాయల నిధులతో 12 పంచాయతీలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి శివలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని తుడా పరిధిలోకి తీసుకొచ్చిన తర్వాత 40 కోట్ల రూపాయల నిధులతో 12 పంచాయతీలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. దేశంలోని ఎక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని తెలిపారు. నేడు ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు. మండలంలో పార్టీలకు అతీతంగా ఇంత అభివృద్ధి జరుగుతున్నా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో విమర్శించడం తగదని వైసిపి నాయకులు చెంగల్ రెడ్డి అన్నారు. మండలంలో హౌసింగ్ పై అవకతవకలు ఉన్నాయని సర్వంట్ రమేష్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిపి శివలక్ష్మి, జడ్పిటిసి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అధికారి ఆయా రంగాలలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో అమరనాథ్, సర్పంచులు, ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- డ్రైనేజీలు అస్తవ్యస్తం
- పల్లెలు దుర్గంధభరితం
- స్పందించని అధికారులు

డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో అపరిశుభ్రంగా మారిన వీధులు

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. పల్లెలు దుర్గంధభరితమయ్యాయి. దోమలు అధికం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెలికంపాడు, కుర్రా గుంట 20 పంచాయతీలలో సైడు కాలువలు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తూ దుర్గంధ వాసనతో పల్లెలు పలుకరిస్తున్నాయి. గ్రామ సచివాలయ వ్యవస్థ అమలు కాకముందు మండల ప్రజాపరిషత్ అధికారి, పంచాయతీ కార్యదర్శి పరిశుభ్రతపై దృష్టి సారించేవారు. కాని సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత 14వ,15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చినా పనులు చేయకనే నిధులు మాయమవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గతంలో సిబ్బంది తక్కువగా ఉన్నా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేవని నేడు సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని శాఖ సిబ్బంది ఉన్నా, సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెలో పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ వున్నా మురుగునీటి కాలువలు పూడిక తీయడం లేదని, బీపురు కట్టలతో శుభ్రం చేసినట్లు ఫోటోలు తీసి ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసి వెళుతున్నారని నెల, నెలా కాకపోయినా ఆరు నెలలకు ఒక సారైనా జీతాలు తీసుకొంటున్నారే తప్ప గ్రామాలలో వీధులు, కాలువలు శుభ్రం చేయడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లడం లేదని వాపోతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వైద్య ఆరోగ్యశాఖ, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి పంచుకోవడం తప్ప పల్లెలో పనులు చేయడం లేదని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు , జ్వరాలు పల్లెలో ప్రబలే ప్రమాదం ఉంది. కాలువలో మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు అధికమై విషజ్వరాలు, మలేరియా, డెంగీ, తదితర సీజనల్ వ్యాధులు త్వరగా వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది మండల ప్రజాపరిషత్ అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాలలో మురుగు కాలువల పూడిక తీయించి, నీరు నిల్వలేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

విష జ్వరాలు ప్రబలుతున్నాయి..

మా గ్రామంలో ఎంతో కాలంగా కాలువలు పూడిక తీయక పోవడంతో వర్షాలు పడి నీళ్లు నిలబడి దోమలు వ్యాపించి జ్వరాలు వస్తున్నాయి. దీనిపై సచివాలయ అధికారులకు తెలిపినా పట్టించుకోవటం లేదు. తాగునీటి బోరు దగ్గర మురుగు నీరు చేరి బోరు బావి కలుషితం అవుతోంది. అధికారులు స్పందించాలి.
- కృష్ణయ్య, చెలికంపాడు గ్రామ పంచాయతీ.

మంగళం ట్రెండ్స్‌కు మైక్ వితరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌కు తిరుపతి రూరల్ ఎడిపై ప్రయివేటు పాఠశాల డైరెక్టర్ ప్రణీత్ 50 వేల విలువ గల మైక్ సిస్టంను, క్రీడా సామగ్రిని వితరణగా అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.కేశవులు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎడిపై పాఠశాల అకాడమిక్ డీన్ పి.జాహ్నవి మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని ఇతరులకు దానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అలా 9, 10వ తరగతి విద్యార్థులు సేకరించిన ఈ రోజు వితరణ కార్యక్రమానికి వినియోగించారని పాఠశాల ప్రిన్సిపాల్ దేవరాజులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిపై స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెల్లూరులో తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్న వైసిపి నాయకులు

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని చెల్లూరులో తాగునీటి సమస్య ఉండడంతో గ్రామస్తులు తమ శాసనసభ్యులు బియ్యపు మధు సూదన్ రెడ్డి కి తెలిపారు. వెంటనే స్పందించి ఏర్పేడు మండలం వైసిపి ఇన్‌ఛార్జి గున్నేరి కిషోర్ రెడ్డికి తెలపగా బోర్ వెల్స్‌ని పంపి 300 అడుగుల మేర బోరు ఏర్పాటు చేశారు. మూడించుల వాటర్ రావడం తో గ్రామస్తులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపి యాదవ్, మధు యాదవ్, వేణు యాదవ్, హరి గౌడ్, అర కొండ సుబ్రమణ్యం గౌడ్, దేవ యాదవ్, భక్త గౌడు, బీమా చెంచయ్య,ప్రేమ గౌడ్, బిల్లు మోహన్ యాదవ్,సురేష్ ముదిరాజ్, వెంకటేష్, బిల్లు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

' జయకృష్ణనే దౌర్జన్యం చేస్తున్నాడు..'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీకాళహస్తి నియోజికవర్గ పరిధిలోని మిట్టకండ్రిగలో తమ స్థలంలో చదును చేసుకుంటుంటే ఉద్దేశ్య పూర్వకంగా స్థానిక ఎమ్మెల్యే ప్రోద్భలంతోనే ఇదంతా జరుగుతోందని తప్పుడు సమాచారాన్ని మీడియాకు జయకృష్ణ అనే వ్యక్తి ఇచ్చాడని, వాస్తవానికి తమ స్థలంలో తాము దారి ఏర్పాటు చేసుకుంటున్నామని మిట్టకండ్రిగకు చెందిన రాధ, బాబురావు, కార్తిక్ యాదవ్‌లు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ పిత్రు స్వయార్జితంగా సంక్రమించిన భూమిలో దారి ఏర్పాటు చేసుకుంటుంటే స్థానికంగా ఉన్న జయకృష్ణ తమ భూమిని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. తమకున్న మూడెకరాల్లో ఎకరా స్థలంపై కోర్టులో వివాదం నడుస్తోందన్నారు.

వైసిపికి మిత్రపక్షంగా పనిచేస్తాం..

యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ భారత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసిపికి మిత్ర పక్షంగా ఉంటూ ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల వద్దకు ప్రచారస్త్రాలుగా తీసుకెళతామని యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు కొన్ని అనివార్య కారణాలతో పార్టీ ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మధు, హరి పాల్గొన్నారు.

అర్హులను అనర్హులుగా చూపారు: రవినాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నోటిఫికేషన్లు విడుదల చేస్తానని చెప్పిన సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు ఎస్ఐ రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదల చేసి అర్హత పొందిన వారిని కూడా అనర్హులుగా ప్రకటించడం చూస్తుంటే ఎంత పెద్ద అవినీతి రిక్రూట్‌మెంట్‌లో దాగి ఉందో అర్థమౌతోందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రవి నాయుడు మాట్లాడుతూ ఒక నోటిఫికేషన్‌ను కూడా సమర్థవంతంగా నిర్వహించలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, అనర్హులుగా ప్రకటింపబడ్డ వారు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు స్టే ఇచ్చిందన్నారు. దీనిపై తెలుగు యువత ఆధ్వర్యంలో న్యాయ పరంగానూ, నిరసనల రూపంలో ప్రభుత్వ వైఖరిపై పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ మధు, శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థుల ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలని టిఎన్ఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఎస్వీయూలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, కార్యకర్తలు సమావేశం టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ కాలేజీలు పరీక్షలు నిర్వహించకుండా విద్యార్థుల్ని ఇబ్బందులకి గురిచేస్తున్నాయని విద్యా సంవత్సరం పూర్తిచేసుకున్నవారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులకు ఇబ్బంది పెడుతున్నారని కొత్తగా విద్యార్థి, తల్లి జాయింట్ అక్కౌంటు మెలికతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీజులు, బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నాగేంద్ర బాబు, గణేష్,వంశీ,రఘు,బాలాజీ పాల్గొన్నారు.

పర్యావరణ కాలుష్యంతో పలు సమస్యలు

ప్రజాశక్తి - క్యాంపస్ : పర్యావరణ కాలుష్యంతో మానవాళికి పలు సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ బీసీఈడి, ఎస్వీయు క్యాంపస్ స్కూల్ ఆధ్వర్యంలో క్యాంపస్ పాఠశాలలో పర్యావరణ కాలుష్యం అనే అంశంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల హెడ్మాస్టర్ ఐ. షకినమ్మ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం ఎక్కువై ప్రపంచ మానవాళికి పలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందన్నారు. వైరాలజీ విభాగం అధ్యాపకులు రిసోర్స్ పర్సన్ ఆచార్య నరసింహ మాట్లాడుతూ మనం నివసించే ప్రదేశంలో చుట్టూ ఉండే ప్రాంతాన్ని పరిసరాలు అంటారని, ఈ పరిసరాలను పరిశుభ్రంగా పర్యావరణం కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

వెండోడు రైల్వేస్టేషన్‌లో రైళ్లు ఆపాలి

రైల్వే చీఫ్ పబ్లిక్ ట్రాఫిక్ మేనేజర్‌కు వినతి

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండలంలోని జయంపు గ్రామంలోని వెండోడు రైల్వేస్టేషన్ లో రైళ్లు నిలపాలని రైల్వే చీఫ్ పబ్లిక్ ట్రాఫిక్ మేనేజర్ యలెంద్రయాదవ్‌ని స్థానికులు శుక్రవారం కలిసి వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 24 గ్రామాల ప్రజలకు అనుకూలమన్నారు. విద్యార్థులు, వివిధ పనులపై పట్టాణలకు వేళ్లేవారు, 2019లో వచ్చిన కరోనా కారణంగా వెందోడు స్టేషన్ లో రైళ్లు నిలపడం లేదని వాపోయారు. కృష్ణా, పూరీ , బిలాస పూర్ , తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని కోరారు. స్పందించిన రైల్వే చీఫ్ పబ్లిక్ ట్రాఫిక్ మేనేజర్ మాట్లాడుతూ వెండోడు రైల్వేస్టే షన్‌లో త్వరలో రైళ్లు ఆగుతాయని అధికారికంగా ప్రకటి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బిజినెస్ ఆఫీసర్ సుబ్బారావు, పాముల రాంబాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు సి. చంద్రప్ప, ఉపాధ్యక్షులు డి.ప్రసంతిరాజు ఉన్నారు.

నగరి ప్రజలకు రుణపడి ఉంటా..

జన్మదిన వేడుకల్లో మంత్రి రోజా

మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: నగరి నియోజకవర్గంలో నా కోసం అనుక్షణం కృషి చేస్తున్న నా వాళ్లకి నా 'ఊపిరి ఉన్నంత వరకు నగరి ప్రజలకు రుణపడి ఉంటా' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. పుత్తూరు మండలం వేపగుంట సమీపంలోని కల్యాణ మండపంలో శుక్రవారం జన్మదిన వేడుకల్లో మంత్రి రోజా ప్రసంగించారు. అశేష అభిమానులు, వైసిపి కుటుంబ సభ్యుల హర్షధ్వానాల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనకు సహకరించిన వాళ్లు, తాను బాగుండాలని ఆశీర్వదిస్తున్న వాళ్లు కష్ట సుఖాలలో పాలుపంచుకుంటున్నారని తెలిపారు. తనను ఎప్పుడూ వెన్నంటి ప్రోత్సహించే భర్త సెల్వమణి సహక రించిన నా పిల్లలు, తనను గెలిపించిన నగరి ప్రజలకు కృత జ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ 175 కి 175 స్థానాలు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధివైపు, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తన మొదటి సినిమాలో పాట పాడిన ప్రముఖ గాయకులు మనోతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ జన్మదిన వేడుకలలో మంత్రి అంబటి రాంబాబు, టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి, తమిళనాడు నాయకులు దిండిగల్ లియోని ప్రసంగించారు. వైసిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి, నగరి ఛైర్మన్ నీలిమేఘం, వైస్ ఛైర్మన్లు డి శంకర్, డి జయ ప్రకాష్, ఎంపీపీలు మునివేలమ్మ, వనమాల పేట ఎంపీపీ విజయలక్ష్మి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

త్వరలోనే సప్లై ఛానెల్ పనులు ప్రారంభం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -కోట : త్వరలోనే సప్లై ఛానెల్ పనులను ప్రారంభిస్తామని ఎంఎల్‌సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. కోట మండలంలోని కేశవరం పంచాయతీలో రాఘవపురం నుండి చిల్లకూరు మండలంలోని తోణుకుమాల గ్రామాలకు వెళ్లే బి.టి రోడ్డు సప్లై ఛానల్ బ్రిడ్జి పనులు మధ్యలో ఆగిపోవడంతో గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియడంతో స్థానిక నాయకులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులు బల్లి.కళ్యాణ్ చక్రవర్తి, గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సప్లై ఛానల్ బ్రిడ్జి పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి,ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట మండలం నాయకులు గురుస్వామి,నరమాల రమణయ్య, కోట మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్ గౌడ్, చిల్లకూరు మండల నాయకులు మారంరెడ్డి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

లింగ వివక్ష లేకుండా చూడండి: డిఆర్‌వో

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: భేటీ బచావో అండ్ భేటీ పడవో అనే నినాదంతో లింగవివక్ష లేకుండా చూడాలని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తెలిపారు. శుక్రవారం జిల్లా స్థాయి సమావేశం జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, కలెక్టరేట్ సమావేశ మందిరంలో భేటీ బచావో అండ్ భేటీ పడవో (బాలికను రక్షించండి – బాలికను చదివించండి) పై జిల్లా స్థాయి అధికారులతో డిస్ట్రిక్ రెవెన్యూ అధికారి పెంచల కిశోర్ ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో మాట్లాడుతూ శిశు లింగ నిష్పత్తిని పెంచడం, లింగ వివక్షను లేకుండా చేయడం, ఆడ పిల్లలను రక్షించి, చదివించాలనే లక్ష్యంతో భేటీ బచావో భేటీ పడవో ముఖ్య ఉద్దేశం అన్నారు. భ్రూణ హత్యలు, బాల్య వివాహాలను అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషితో పని చేయాలన్నారు. ఆడ పిల్లలు పుట్టడం అనేది అదృష్టంగా భావించాలని, మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను పెంచాలన్నారు. స్కానింగ్ సెంటర్స్ పైన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ డ్రాప్ అవుట్ రేట్ గురించి అధికారులతో అడిగి తెలుసుకొన్నారు. డీస్పీ కాటమ రాజు మాట్లడుతూ పిల్లలకి, మహిళలకు సంబంధించి అనేక అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ఇస్తున్నామని, ఆడ పిల్లలు బాగా చదువుకొని వాళ్ల కాళ్ల పై వాళ్లు నిలబడిమగవారితో సమానంగా రాణించాలన్నారు. ఈ కార్య క్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్, వివిధ విభాగాధి పతులు, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

పులివర్తి నాని తనయుడు ప్రచారం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్సీలను వైసిపి ప్రభుత్వం అన్ని విధాల దగా చేస్తోందని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు, యువ నాయకుడు పులివర్తి వినీల్ ఆరోపించారు. 'మీ ఇంటికి మీ పులివర్తి నాని', 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా వినీల్ చంద్రగిరి మండలంలోని ఐతేపల్లి ,అగరాల హరిజనవాడ ఎస్సీ కాలనీలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి టిడిపి చేపట్టబోయే భవిష్యత్ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామాలకు చేరుకున్న వినీల్ తో పాటు టిడిపి నాయకులకు, యువత ,మహిళలు ప్రేమ పూర్వక అపూర్వ స్వాగతం పలికి బాణాసంచా పేల్చారు. పూలమాలలు వేసి దిష్టి తీశారు. యువ నాయకుడు తమ గ్రామాలకు రావటం ఎంతో శుభసూచికంగా గ్రామస్తులు అభివర్ణించారు. తమ భవిష్యత్తుతో పాటు బిడ్డల భవిష్యత్తును కూడా కోల్పోయామని వినీల్ ముందు పలువురు దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాలలో నేటి పాల నా కాలం పూర్తిగా కక్ష పూరితం గా సాగింద న్నారు. ఇక మీదట ఎన్నితాయి లాలు ఇచ్చిన తాము మోస పోవటానికి సిద్ధంగా లేమని, టిడిపికి అఖండ విజయం చేకూర్చే వరకు తాము విశ్రమించబోమని వినీల్ ముందు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారితో యువ నాయకుడు పులివర్తి వినీల్ మాట్లాడుతూ 2024 ఎన్నికలలో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పులివర్తి నానికి ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇచ్చి అభివృద్ధి పనులకు నాంది పలుకుదామన్నారు. హరిజన గిరిజన యువతకు ఉపాధి కల్పించే బాధ్యత నాని తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు , కార్యకర్తలు, మహిళలు, యువత ,అభిమానులు పాల్గొన్నారు.

14, 15వ ఆర్థిక సంఘం నిధులు ఏమయ్యాయి?

ఎంపిపిని నిలదీసిన సర్పంచులు

ప్రజాశక్తి - పెళ్లకూరు: 14, 15వ ఆర్థిక సంఘం నిధులు ఏమయ్యాయి? ఏయే పథకాలకు ఖర్చు చేశారో తెలపాలని సర్పంచులు ఎంపిపిని నిలదీశారు. పెళ్లకూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలంరెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ దళారులు లేని వ్యవస్థ, ప్రతి సంక్షేమ పథకం ప్రజల వద్దకే నేరుగా చేరేలా గ్రామ స్వరాజ్య ప్రతి రూపాన్ని జగనన్న పాలనలో చూస్తున్నామని కొనియాడారు. జడ్పిటిసి ప్రిస్కిల్లా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజల వద్దకే పాలనలో, ప్రజలకు అన్ని రంగాల్లో అన్ని విధాల ఉపయో గపడేలా అన్ని శాఖ ల అధికారులు సహ కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు, ప్రత్యేక అధికారి వేణుగోపాల్, డిప్యూటీ తహశీల్దారు ముని కిరణ్, వైస్ ఎంపీపీ బెల్లపు రవిరెడ్డి, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

అధిక ఉప్పు వాడకం తగ్గిస్తే రక్తపోటు నియంత్రణ

విలేజ్ డాక్టర్స్ క్లినిక్‌లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రజల్లో రోజు రోజుకు బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులు అధికమవుతున్నారని, వీటిని నియంత్రిం చడానికి మన ఆహారపు అలవాట్లలో మార్పు రావాలని డాక్టరు చంద్రకళ సూచించారు. దొరవారి సత్రం పిహెచ్‌సి పరిధిలోని పాలెం పాడులో శుక్రవారం నిర్వహించిన విలేజ్ డాక్టర్స్ క్లినిక్ 104 ద్వారా రోగులకు వైద్య సేవలు అందించారు. ప్రధానంగా అధిక రక్తపోటును అరికట్టాలంటే మనం తీసుకునే ఆహారంలో ఉప్పు మోతాదును స్వల్పంగా తీసుకోవాలని, ఉప్పుతో కూడిన చేపలను తీసుకోవడం మానుకోవాలని రోగులకు సూచించారు. షుగర్ వ్యాధిగ్రస్తులు గ్లూకోస్ అధికంగా ఉన్న ఆహార పదార్థాలు వాడకం తగ్గిం చాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం లోని ఆహార పదార్థాలు పరిశీలించారు. వంటగది, పిల్లలు ఉంటున్న గదుల్లో అపరిశుభ్ర వాతావరణం ఉందని కార్యకర్తను హెచ్చరిస్తూ సరి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు హాజరు సిబ్బంది, అటెండెన్స్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొని పలు గృహాలు సందర్శించారు. సెప్టిక్ ట్యాంక్ పై ఏర్పాటు చేసిన ఎయిర్ పై రంధ్రాలు లేకుండా వల లాంటిది ఏర్పాటు చేయాలని గృహ యజమానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రమేష్ బాబు, హెల్త్ విజిటర్ మైథిలి, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఆరోగ్య కార్యకర్త సుధాకర్ ఏఎన్ఎం, డోరతి శ్రావణి ఆశ కార్యకర్తలు మంజుల, వీరమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని ఎంపీయుపి కాపు వీధి స్కూల్, జడ్పీ హైస్కూలు బాలికల పాఠశాల, మెయిన్ స్కూల్, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గ్రంథాలయాధికారి కె మీనాకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలో ముగింపు రోజు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి, మెయిన్ స్కూల్ మురళీ కృష్ణ, మల్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయ్ కుమార్‌కు పితృవియోగం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు గెడిపూడి విజయ్ కుమార్ నాయుడు తండ్రి గెడిపూడి పరంధాములు నాయుడు శుక్రవారం కన్నుమూశారు. ఆయన భౌతిక కాయానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి నివాళు లర్పించారు. విజయ్ కుమార్‌ను పరామర్శించి పార్టీ అండ ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

జగనన్న విద్యా దీవెనతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది

- ఏబీవీపీ కన్వీనర్ తడుకు చందు

ప్రజాశక్తి -నాయుడుపేట: జగనన్న విద్యా దీవెన కొత్త విధానంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోందని ఏబీవీపీ కన్వీనర్ తడుకు చందు అన్నారు. ఎబివిపి నాయకులు స్థానిక గడియారం సెంటరు నుండి తహశీల్దారు కార్యా లయం వరకు సుమారు 200 మంది విద్యార్థులతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట ఏబీవీపీ బాగ్ కన్వీనర్ తడుకు చందు మాట్లాడుతూ నిధులు మంజూరు కావాలి అంటే విద్యార్థులు తన తల్లిదండ్రులతో కలిసి జీరో అకౌంట్ ఓపెన్ చేయాలనే ప్రక్రియను తీసుకు రావడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని దూరప్రాంతాలలో చదువుతున్న విద్యార్థులు అకౌంట్ ఓపెన్ చేసుకోవాలంటే ఎంతో ప్రయాసతో కూడుకుంటోందని, విద్యాదీవెన పాత పద్ధతినే కొనసాగించాలని లేని పక్షంలో ఎబివిపి తీవ్ర ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు, నగర మహిళ కార్యదర్శి మహేశ్వరి, నగర కార్యదర్శి కిరణ్, ప్రణయ్ శివకుమార్, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవులను సన్మానిస్తున్న ట్రస్టు బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

కవులకు సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక ప్రధాన గ్రంథాలయ శాఖ కార్యాలయంలో శుక్రవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖ కవులు బమ్మెర పోతన, ఆదికవి నన్నయ్యభట్టు, గురజాడ అప్పా రావు, జంధ్యాల పాపయ్య వంటి కవుల గురించి వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చాటిన కవులను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం లో పాల్గొన్న కవులను తన చేతుల మీదుగా సత్కరించడం ఆనందంగా ఉందని ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. కవులు గురు నాథం, ఆనందయ్య మునిసుబ్బారెడ్డి, గ్రంథాలయ అధికారి ఎన్ఎస్ లావణ్య, తొట్టంబేడు గ్రంథాలయ అధికారి ఎ హరికృష్ణ, రిటైర్డ్ గ్రంథాలయ అధికారి బి చెంచురెడ్డి పాల్గొన్నారు.

సిఐకి ఫిర్యాదు చేస్తున్న జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటా వినుత

నాపై హత్యాయత్నానికి కుట్ర

సిఐకి జనసేన కోటా వినుత ఫిర్యాదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'నన్ను, నా భర్తను అంతమొందించేందుకు కొందరు కుట్ర చేస్తున్నారు..' అని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోటా వినుత పరోక్షంగా అధికారపార్టీ పై ఆరోపించారు. 'ఓ పథకం ప్రకారం హత్య చేయడానికి మా కారు చక్రాలకు బోల్టులు తీసేయడమే ఇందుకు ఉదాహరణ ' అని ఆమె చెప్పుకొచ్చారు. ఇదే విషయంపై వినుత గురువారం అర్ధరాత్రి టూ టౌన్ సీఐ మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. తమ కారు చక్రాలకు బోల్టులు తీసేశారని కొందరు మాకు ఫొటో తీసి వాట్సప్ చేయడంతో తాము మేల్కొన్నామని, లేకుంటే మార్గ మధ్యంలో ప్రమాదానికి గురయ్యేవారమని వాపోయారు. మొత్తం మీద తాము చేస్తున్న పోరాటాన్ని జీర్ణించుకోలేక, తమను ధైర్యంగా ఎదుర్కోలేక ఇలా పిరికిపందల్లా హత్య చేయడానికి కుట్ర పన్నుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాము సైనికుల్లా పోరాడతామనీ, పవన్ కల్యాణ్‌ను సీఎంను చేసేవరకు నిద్రపోమని స్పష్టం చేశారు.

సంస్కృత శాస్త్ర వ్యాఖ్యాన మాల రెండవ శాస్త్రార్థగోష్ఠి

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత శాస్త్రాలలో ఉండే శాస్త్ర జ్ఞానాన్ని ఆచార్యులకు, పరిశోధకులకు, విద్యార్థులకు తెలిపేందుకు దశాబ్దాల కాలంగా విశ్వవిద్యాలయంలో మహామహోపాధ్యాయ శ్రీపట్టాభిరామశాస్త్రి సంస్కృత శాస్త్ర వ్యాఖ్యాన మాల పేరుతో జరిగే శాస్త్రార్థసంగోష్ఠి రెండవ శాస్త్రచర్చా కార్యక్రమం విశ్వవిద్యాలయం ప్రముఖ రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో నిర్వహించారు. విశ్వవిద్యాలయం వైస్–చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఆర్ క్రిష్ణమూర్తి ఆధ్యక్షతన సాహిత్య శాస్త్ర పండితులు ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ శబ్దశక్తి విమర్శ అనే సాహిత్య శాస్త్ర అంశంపై చర్చించారు. విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ జియస్ఆర్ క్రిష్ణమూర్తి ఈ అంశంపై విశ్లేషించారు. ఈ కార్యక్రమానికి సంయోజకులు ప్రొ.కె.గణపతిభట్, సహ సంయోజకులుగా డాక్టరు సోమనాథ్ దాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం సాహిత్య విభాగం ఆచార్యులు, విభిన్న విభాగాల అధ్యక్షులు, ఆచార్యులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు.

12 ఏళ్లు నిండిన విద్యార్థులకు బ్యాంకు అకౌంటు

సహకార సంఘం బ్యాంకు చీఫ్ బ్రాంచ్ మేనేజర్

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : 12 ఏళ్ల నిండిన విద్యార్థులకు బ్యాంకు అకౌంటు ప్రారంభిస్తామని గూడూరు సహకార సంఘం బ్యాంకు చీఫ్ బ్రాంచ్ మేనేజర్ సత్యవతి పేర్కొన్నారు. మండలంలోని గొల్లపల్లిలో ఉన్న విందుటి సౌజన్య రెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు బ్యాంక్ అకౌంట్‌లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 12 ఏళ్లు నిండిన 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు అమ్మఒడికి ఉపయోగ పడుతుందన్నారు. ఇక డిగ్రీ చదువుతున్న విద్యార్థులు జాయింట్ అకౌంట్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొందన్నారు. విద్యార్థి, తల్లిదండ్రులతో సహా జాయింట్ అకౌంట్ ప్రారంభిస్తామన్నారు. జాయింట్ అకౌంట్‌కు మాత్రం రూ.300 లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు ఒక్కరే అకౌంటు చేయించుకుంటే రూ.100 చెల్లిస్తే చాలన్నారు. అనంతరం విద్యార్థు లకు అకౌంటు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గూడూరు బ్రాంచ్ సహకార సంఘం బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ జయంపు గురు నాథం, వెందోటి సౌజన్య రెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ దానం సురేంద్ర బాబు, డైరెక్టర్ దానం జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షపై ఉచిత అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక వరదరాజనగర్ లోని విశ్వం టాలెంట్ స్కూల్ లో ఆదివారం ఉదయం 9 గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్‌లో 2024 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగహన సదస్సు నిర్వాహిస్తామని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టరు ఎన్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు 4వ తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థు లు, వారి తలిదండ్రులు పాల్గొని ఈ పోటీ పరీక్ష వివరాలు, వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చుని తెలిపారు. పరీక్షలో సీట్లు పొందడానికి మెలుకువలను, పద్ధతులను వివరిస్తారన్నారు. 9399976999, 8688888802 నెంబరులను సంప్రదించవచ్చునని తెలిపారు.

క్లైయిమ్‌ల పరిశీలన జాగ్రత్తగా చేపట్టాలి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఓట్ల తొలగింపు, చేర్పులపై ప్రజల నుండి వచ్చిన క్లైయిమ్ ల పరిశీలన జాగ్రత్తగా చేపట్టాలని తిరుపతి నియోజక ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరితఅధికారులను ఆదేశించారు. క్లైయిమ్ ల పరిశీలన, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు తదితర అంశాలపై శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెక్టోరల్ ఆఫీసర్స్, సూపర్ వైజర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తహశీల్దార్ వెంకటరమణ, రెవెన్యూ అధికారులు కే.ఎల్.వర్మ, సేతు మాధవ్, సెక్టోరల్ ఆఫీసర్స్, సూపర్ వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు పులివర్తి నాని

టిడిపి అధికారంలోకి రావడం ఖాయం: నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం 'ఇంటింటికి మీ పులివర్తి నాని' కార్యక్రమాన్ని పున:ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి హామీలను ప్రజలకు వివరించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ టిడిపి కమిటీ అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప(చంద్ర), మహిళా అధ్యక్షురాలు అనసూయ, అజీస్ బాషా, సదాశివం పాల్గొన్నారు.

IN THE COURT OF ADDITIONAL DISTRICT JUDGE - IV AT PONNERI
M.C.O.P.No. 751 of 2017
Sumathi and others ....Petitioner
Vs.
1. Radhakrishnan Kumar
2. The National Insurance Co. Ltd.,
.....Respondents
To,
Radhakrishnan Kumar,
S/o.Radhakrishnan, No. 3/3, Super Bazar, Opp Governerpet, Krishna Vijayawada Urban, Vijayawada, Andhrapradesh.
NOTICE
Please take notice that the above MCOP No. 751 of 2017 has been posted for your appearance on 27.11.2023 before the Additional District Judeg - IV, at Ponneri. Hence you are requested to appear before the Hon'ble court on 27-11-2023 at about 10.30 A.M. failing which you will be set exparte and the case will be decided on merits.
A.J. CHANDRASEKARAN,
M. MURUGESAN
Counsel for Petitioner